# పెళ్లి సన్నాహం

తల్లి పూజకని దొడ్లో మందారపువ్వులు కోస్తూ ఆలోచిస్తోంది లక్ష్మి. మల్లెమందిరినించి మంచు బొట్లు చిటపట రాలుతున్నాయి.

వచ్చి ఏడాది కావస్తోంది. వెళ్లిపోతానని తొందరపడితే, పెనిమిటి మీద మమకారం వెల్లడవు తుందేమోనని బిడియపడి ఊరుకుంది ఇన్నాళ్లూనూ; ఉత్తరమైనా లేకండా తీసికెడితే, వదిలించుకోవాలని చూస్తున్నట్టుంటుందని పస్తాయిస్తున్నాడు తండ్రి. భర్త దగ్గరనుంచీ ఉత్తరం రాదు; యుద్ధం వచ్చిం తరువాత పని తెమలటం లేదో – ఏమో లేకపోతే...

"అమ్మాయీ" తండ్రి పిలుస్తున్నాడు. పూజ పళ్లెం తులసికోట దగ్గిరపెట్టి లోపలికి వెళ్లింది. పంచపాళీలో కపిలెకట్ట చూచుకుంటున్నాడు శరభయ్య.

"ఇటు చూడమ్మా; నీకు వంట్లో పూర్తిగా ఆరోగ్యం చేరుకున్నట్టేనా?"

"ఇక ఔషదమఖ్ఖర్లేదండి నాన్నగారు"

"ఏదో భగవంతుడి కృపవల్ల నిన్ను దక్కించుకోగలిగాము తల్లీ! మళ్లీ నిన్ను ఆ అయ్య చేతుల్లో పెట్టగలనని అనుకోలేదు. క్షయ అంటే ఓ పట్టాన్ని స్వాధీనమయ్యే జబ్బామరి; ఆచార్లుగారు చెబుతూనే వున్నారు, చాలా గడ్డుకేసని."

కళ్లు చెమ్మగిల్లాయి లక్ష్మికి.

"అయితే, ఒకమాట అడుగుదామనుకుంటున్నాను–" తల తడుముకొంటున్నాడు, అడుగుదామా వొద్దా అని.

చెల్లెమ్మ కిటికీ పరంజాలో వొలకబోసిన పొడరు డబ్బా సర్దుతూ, పరధ్యానంగా నిలబడింది లక్ష్మి. దూరాన్ని సరుకుతోటల చుట్టూ మూగిన పొగమంచు ఇంకా విడిపోలేదు.

"అల్లుడు దగ్గరనించి ఉత్తరమొచ్చినట్టా?"

"లేదండీ నాన్నగారు; అదే ఆలోచిస్తున్నాను."

కాసేపు ఇద్దరూ మాట్లాడలేదు. ఇంకా ఏమడుగుతాడోనని ఇబ్బందిపడుతోంది లక్ష్మి.

"ఇలా మౌనంగా ఎన్నాళ్లు సహిస్తావు తల్లీ? నిన్ను అంత రోగంతో ఇక్కడికి పంపించి ఏడాది అయిందికదా. ఎన్నిసార్లు రాసినా ఉత్తరం రాయడు, ఎలా ఉన్నదన్నైనా కనుక్కోడు, చెయ్యడు..."

"పని రద్దీగా ఉన్నదేమోనండీ నాన్నగారు; అందులోనూ పోలీసు సూపరింటెండెంటు రీడరన్న తరవాత సర్కీట్లు విశ్రాంతి లేకుండా ఉంటాయి; అయినా, వారి అశ్రద్ధ నాకు తెలుసు"

"ఏమిటో నీకు అభమూ శుభమూ తెలియదు. నాలుగు ముక్కలు రాసిపారెయ్యడానికి ఎంత తీరిక కావాల్నే? అసలు చచ్చిందో బ్రతికిందో తెలుసుకుందామనే ఆత్రుతకైనా..."

"ఒకవేళ బదిలీ అయిందేమో నాన్నగారూ; మన ఉత్తరాలు అందినయ్యో లేవో?"

ఏదో అనేసి తప్పించుకుందామనుకుంటోంది.

"ఆయనకి మన ఉత్తరాలు అందకపోతే, ఆయన రాసే ఉత్తరాలు మనకెందుకు అందవు?"

ఇక సమాధానం దొరకలేదు.

"పుట్టెడు రోగంతో బిడ్డనిక్కడికి పంపేసి, కిక్కురుమనకుండా ఊరుకుంటాడా? నాకు నువ్వు భారమవుతావనికాదు. బాధ్యత ఎరిగున్నవాడి లక్షణమిదేనా అని?"

లక్ష్మి బిక్కమొహం వేసింది పెనిమిటిని సమర్థించలేక.

"ఉత్తరం రాయకపోతేమానె, నాకు మరొహ బెంగ పట్టుకుంది! అసలు నిన్ను మళ్లీ..."

లక్ష్మి భరించలేకపోయింది; గదిలోకి వెళ్లిపోయి తలుపేసుకుని, మొకమల్ దిండులో తలదూర్చి, వెక్కి వెక్కి ఏడ్చింది.

అల్లుడి మీదవున్న కోపంకొద్దీ నిష్ఠూరంగా మాట్లాడాడుగాని, శరభయ్య కష్టసుఖాలు తెలిసిన గృహస్తు; పట్టు విడుపులెరిగి, సంసారం దిద్దుకుంటూ పోతాడు. అల్లుడు భీష్మించుక్కూచుంటే తనకి తప్పుతుంది గనకనా, కూతుర్ని వొప్పగించి వద్దామని, పంచమినాడు ప్రయాణం కట్టాడు.

లక్ష్మి మనస్సు కుదుటపడింది.

చలపతిరావుతో కొత్తగా విశాఖపట్టణం వెళ్లటమూ క్షయవ్యాధితో మంచమెక్కటమూ ఒక్కసారే జరిగాయి లక్ష్మికి. అప్పుడు ఎన్ని ఇంజక్షన్‌లు పొడిచారో, ఏమి అరఖులు తాగిందో, ఎంతమంది డాక్టర్లు పెదిమి విరిచారో లెఖ్ఖలేదు. చివరికి విసుగుపుట్టి, తనని పుట్టింటికి పంపించిన తరవాత రెండు మూడుత్తరాలు మాత్రం పెనిమిటి దగ్గరనుంచి వొచ్చినట్టు జ్ఞాపకం... ఖాయిలాపడి వ్యాధి ముమ్మరంగా వున్నరోజుల్లో చలపతిరావు పాపం అహోరాత్రాలు నిద్రమానుకొని,

మందుకనీ, మాకుకనీ, డాక్టర్లకనీ, డబ్బుకనీ, తడిమన్ను పొడిమన్ను అయేలా తిరిగి, రాత్రులు నిద్రపట్టక నీరసించివున్న రోజుల్లో, తన పక్కనే, కంటికి రెప్పలా కూచుని ఉన్నప్పుడు, అతని కళ్లలోతుల్లో మెరిసిన ఆందోళన ఇంకా కలవర పెడుతూనే వుంది.

ఒకదాని తరవాత ఒకటి జ్ఞాపకానికొస్తున్నాయి. వెనక రసూలు కొండలో ఉన్నప్పుడు చలపతిరావుకు మన్యపు జ్వరంవచ్చి ఆరు నెలలు మంచంపట్టాడు. అప్పుడు మంచుగడ కడు తూంటే, అతనన్న మాటలింకా చెవిలో గింగురుమంటున్నాయి.

"లక్ష్మి, నీ రుణం తీర్చుకోలేనే"

"...ఛా అలా అనకండి – నన్ను చంపుకుతిన్నట్టే"

ఆలోచనలింకా వెనక్కి నడిచివెళ్లి, చిన్ని చిన్ని అనుభవాల్ని నెమరుకి తెచ్చుకుంటున్నాయి. కాపరానికి వెళ్లిన కొత్తలో, తోటపల్లి కొండలకి శాంతి ఆశ్రమం చూద్దామని వెళ్లినప్పుడు, ఆ నున్నని బండరాళ్ల మీదనుంచి, తన కాలు జారుతుందేమోనని మాటి మాటికీ వెనక్కి తిరిగి చూస్తో, చేతులందించినరోజులూ, అప్పటి జ్ఞాపకాలూ, ఇంకా మనస్సులో రెపరెపలాడుతున్నాయి.

ఆ రోజులు మళ్లీ ముస్తాబై, ముందుకు జరిగి, రా రమ్మని పిలుస్తున్నాయి, రాత్రి అలజడితగ్గి ప్రశాంతంగా ఉంది. ఆంజనేయస్వామి కోవెలలోనుంచి ధ్వజస్తంభం చిరుగంటలు గలగల గల మంటూ ఆనందాన్నే గిలకరించి పోస్తున్నంట్టున్నాయి.

తెలతెలవారుతోందనగా మేడమెట్లుదిగింది లక్ష్మి, నాలుగేళ్లే కాపురం చేసినా, నాలుగు రోజులే గడిచిపోయినట్టనిపిస్తోంది. తమ్ముడిచేత పెనిమిటి పేరు ఇంగ్లీష్‌లో డిజైన్ వేయించుకొని, ఉబలాటపడుతూ అల్లిన రుమాల జాగర్తగా సూట్‌కేస్‌లో సర్దుతుంటే, కొత్తగా మళ్లీ కాపరానికి వెడుతున్నట్టే అనిపించింది.

గణగణ గణమంటూ రెండెడ్లబండి ఇసిక తోవలోనించి మామిడి తోపు పక్కనే నడుస్తోంది. పచ్చికబయళ్ల మీదనించి, అలిసిపోయినట్టు మందమందంగా వొస్తూన్న వర్షపుగాలికి, వొత్తుగా మొలిచిన గడ్డిపువ్వులు పకాలుమని నవ్వుతున్నాయి.

కూతుర్ని అత్తింటివద్ద దిగవిడిచి, శరభయ్య కుప్ప నూర్పిళ్లు ఇంకా కాలేదని, అల్లుడు బలవంతపెట్టినా వీలులేక, పనితొందరలో తిరిగి వొచ్చేసాడు.

లక్ష్మి వెళ్లిన రోజున అత్తా, ఆడబిడ్డా ఊళ్లోలేరు. మర్నాడు వొచ్చారు బండిదిగి. ఖంగారుగా వొకళ్ల నొకళ్లు చూచుకున్నారు. లక్ష్మి కర్ధంకాలేదు. ఆడబడుచు పలకరించలేదు. అత్త కుశల ప్రశ్నలతో సరిపెట్టింది.

భార్యా భర్తలకి ఎంత రాత్రి అయినా మాటలు తరగడం లేదు.

"నన్ను మళ్లీ ఆనవాలుపట్టగలిగారా?"

"ఛ – ఎన్నాళ్లయితే మటుకు, నా లక్ష్మి నాకు కొత్తదవుతుందా?"

దగ్గరకి తీసుకొని మెడమీద చిన్నతేలిక ముద్దు పెట్టుకున్నాడు.

నిలిచిపోయిన చిరునవ్వులా, వెన్నెల చిక్కగా అలుముకుంది: మేడగది కిటికీలోనించి తొంగిచూస్తూ వ్రేలాడుతోన్న మాలతి తీగ సువాసనలు దోసిళ్లతో నింపుకొని ఎదురుచూస్తోంది.

"ఈ రాత్రికోసం ఎన్నాళ్లని తపించానో, ఎన్ని రోజుల్ని వెనక్కి తోసేసి ముందుకు రావాలని పెనుగులాడానో - మీరు నమ్మరు..."

కిక్కురుమనకుండా ఊరుకున్నాడు చలపతిరావు. తన ఉపేక్షకి సమాధానం దొరకక మధనపడుతున్నాడు పాపం.

"వొద్దామనుకుంటున్నా - అంతట్లో..."

ఆ సంగతే మరిచిపోయింది లక్ష్మి; బుగ్గకి బుగ్గ ఆనించి, కళ్లల్లోకి చూసింది, రాజీ సూచనగా.

మర్నాడు ఇద్దరూకలిసి సినిమాకి వెళ్లారు. అత్తగారు రాసంది; ఆడబడుచు మూతి ముడుచుకుంది.

చలపతిరావు ఒక నెల సెలవుపెట్టాడు. "ఎందుకురా?" అంది తల్లి. అతను మాట్లాడలేదు; లక్ష్మి సిగ్గుపడింది.

"మీకు కాలక్షేపమెట్లా?"

"నీ దగ్గిర హార్మోనియం నేర్చుకుంటాగా"

"వేషం..."

"నిజం చెప్పమంటావా?" కొంటెతనంగా నవ్వాడు; నిన్ను వదల లేక;"

వాలుజడ రిబ్బన్‌తో చెంపమీద కొట్టింది.

గోడలకి కొత్తగా వెల్లవేయించినట్టున్నారు; ఇల్లంతా శుభ్రంగా వుంది, ఇంటోవున్న వస్తువుల్తో పరిచయం చేసుకుంటోంది లక్ష్మి; సామానుగదిలో ఉప్పులూ, పప్పులూ, వంట చెరుకూ - సమస్తమూ పుష్కలంగా వున్నాయి. భర్త జాగర్తకీ, పొదుపుకీ ఆశ్చర్యమయింది. ఏ నెల కా నెల, ఎంతకావాలో అంతమాత్రమే ఇంటో కొనిపడేసుకునే అలవాటు చలపతిరావుకి.

మేడగదిలో సూటుకేసొకటుంది. తెరిచి చూచింది. కళ్లు చెదిరిపోయాయి? జార్జెటీ సిల్కుచీరెల్తూ, రకరకాల బెంగుళూరు చీరెలూ, జాకెట్లకి బొంబాయి కటపీసులూ, ఖాదీపువ్వుల సిల్కుగుడ్డలూ ఒకటేమిటి!...

కొని, తనతో చెప్పకుండా దాచివుంచాడు-ఆలోచించింది-రేపో, మాపో ఆధార్తుగా .... అత్తారుబతంగా అవన్నీ ఒక్కసారి చూపించి, ఉక్కిరి బిక్కిరి చేదామనుకుంటున్నాడు.

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. ఈదరగాలికి కిటికీ తలుపులు మాటి మాటికీ కసిదీరా

తిట్టుకుంటున్నాయి, లక్ష్మి ఉలిక్కిపడి లేచింది. పక్కని భర్తలేడు. నిశ్శబ్దంగా మేడమెట్లు దిగుతోంది – కింద గుసగుసలు వినబడుతున్నాయి. అత్తా ఆడబిడ్డా ఏదో గూడుపుఠాణీ చేస్తున్నారనుకుంది. కాని భర్తకూడా అక్కడే వున్నాడు. మాటలు స్పష్టంగా వినపట్టంలేదు. వెళ్లి పడుకుంది.

మర్నాడు చలపతిరావు ఆ ప్రస్తావన తీసుకురాలేదు; దానితో భయం పుట్టింది. వీళ్లంతా తనమీద కుట్రచేస్తున్నారా?...

మేడగదిలో కిటికీకి దగ్గరగా, జడకి పాయలు తీసుకుంటోంటే ఇంట్లో పనిచేసే కుర్రాడికి ఏదో కవరు ఇస్తున్నట్టు వినిపించింది. ఇచ్చి చలపతిరావు ఎక్కడికో వెడుతున్నాడు. ఎందుకో ఆదిరెడ్డి వొచ్చి నిలబడ్డాడు. చేతిలోవున్న కవరు చూచింది. చలపతిరావు ఎవరికీ ఉత్తరం రాసిన జాడ కనుపించదు. పరిశీలనగా చూచింది. ఎవరో కొత్త అడ్రసు లాగుంది...

"నేను పోస్టులో వేయిస్తాగాని, బజారుకి వెళ్లి కూరగాయలు తీసుకురా."

ఉపాయంగా వలసంచి ఇచ్చి పంపించింది. తరవాత తలుపులన్నీ వేసి కవరుచించి, రహస్యంగా చదువుకుంది.

చదువుతోంటే చైతన్యమొక్కసారిగా ఇంకిపోయింది. కలా? నిజమా?

చలపతిరావు రెండోపెళ్లి చేసుకోవాలని చూస్తున్నాడు – తనకి జబ్బెంతకీ నయంకాలేదని. రెండోపెళ్లి అంటే మొగాడికింత సులభమా? మన సంప్రదాయాలూ, మన ధర్మశాస్త్రాలూ అంత విపరీతంగా ఉంటాయా?

పెళ్లి అక్కడనే ఆ యింటోనే జరిగించుకోడానికి నిర్ణయమైంది. ఉత్తరం – కాబోయే మామగారికి; తన భార్యని తెచ్చుకున్నాననీ, పెళ్లి తనకఖ్ఖర్లేదనీ వ్రాస్తున్నాడు – ఇప్పుడు ముహూర్తం నాలుగు రోజులుండనగా – ఆయన తొందరపడి వస్తే గలభా అవుతుందట! తనే వచ్చి సంగతులన్నీ విశదంగా చెప్తాడట స్వయంగా.

ఉత్తరం చించి ముక్కలు తన దగ్గరనే ఉంచుకుంది.

రక్తమొచ్చేలా పెదిమలు కొరుక్కుంటోంది. ఏమిటి చేస్తుంది. దుఃఖమూ, కోపమూ, ఒకదానివెనక వొకటి తరుముకొస్తున్నాయి; కన్నీళ్లు జలజల జలా ప్రవహించి పోతున్నాయి; ఏదో అమృతభాండం బ్రద్దలయి పోయినట్టు, బ్రతుకే శూన్యమైపోయినట్టు బాధపడింది.

అర్ధరాత్రి – గాడాంధకారం – తెరలు తెరలుగా పెనవేసుకుంటున్నాయి నల్లని వానకారు మబ్బులు. చలపతిరావుకు మెలుకువ వచ్చింది. లక్ష్మి కిటికీదగ్గర కూచుని ఏడుస్తోంది.

"లక్ష్మి"

గబగబా కళ్లు తుడిచేసుకుంటోంది.

లాలనగా దగ్గిరికి తీసుకున్నాడు. ఆశ్చర్యమైంది.

"ఎందుకు?"

"ఏమీలేదు."

"చెప్పవూ?"

మాట్లాడదు.

చలపతిరావు ఆలోచనలోపడ్డాడు.

ఉదయం డాక్టరు రామారావు వొచ్చాడు. మాటల సందర్భంలో ఆయనొక రహస్యం బయటపెట్టాడు; దానితో, అతనికి బొత్తిగా మతిపోయింది.

రసూలుకొండలో చలపతిరావుకి మలేరియా వొచ్చినప్పుడు, ఆయన ట్రీట్ చేస్తా. జ్వరం తీవ్రంగావొచ్చి స్పృహతప్పి వున్నప్పుడు, డాక్టరు స్పష్టంగా చెప్పేసాడు లక్ష్మితో - రక్తంలేదు - బ్రతకడని. లక్ష్మి గోలపెట్టింది; తన రక్తంతీసి బ్రతికించమని ప్రాధేయపడింది - కాళ్లు పట్టుకుని బ్రతిమిలాడింది - చెప్పినా వినదు - ఆమె దుఃఖం చూడలేకపోయాడు డాక్టరు. సాధనానంతరం లేక, ఆమె నెత్తురు చారెడు చారెడుతీసి అతనికి ముప్ఫై ఇంజక్షన్లిస్తే, తెప్పరిల్లాడు. ఆ తరవాత రక్తపుష్టికని ఎన్ని మందులిచ్చినా లక్ష్మికి పనిచెయ్యలేదు. క్రమేపీ క్షయలోకి దింపింది. అదీ కథ.

అవమానభారంతో కుంగిపోయాడు చలపతిరావు. తన హృదయ కోశాన్ని ఎవరో పెకలించి, తనచేతుల్లోవుంచి, చూచుకొమ్మన్నట్టు ఆవేదనపడ్డాడు. ఏ మొహం పెట్టుకుని తన ప్రవర్తన విప్పి చెపుతాడు? తను చెయ్యడానికి తలపెట్టింది వింటే ఎంత బాధపడుతుందో లక్ష్మి.

లక్ష్మి తన నగలన్నీ తెగనమ్మి, అద్దంవేసి, ఆపత్తు గడిపిందని మాత్రమే అతనెరుగును. ఈ సాహసం లక్ష్మి ఇంతవరకూ చెప్పకుండా రహస్యంగా వుంచింది - తన మనస్సుకి కష్టం కలుగుతుందని...

వానవెలిసిన తెల్లని మబ్బులచాటున నక్కి చందమామ వెక్కిరిస్తోంది; మంచు నీళ్లలో తడిసిన పువ్వులు రాల్చుకుంటోంది మాలతి. రాత్రి నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక పోయింది లక్ష్మి. ఆ ప్రశాంతిలో నిర్లక్ష్యమూ, నిర్దాక్షిణ్యమూ, నిరంకుశత్వమూ స్పందిస్తున్నాయి. పక్కనే భర్త-సర్వస్వమూ అర్పణచేసి, జీవితాంతందాకా పట్టుకుని వేళ్లాడమని రాసివున్న భర్త - పట్టుమని ఆరునెలలు ఔషధమిప్పించలేదు - ఇహ కుదరదని నిశ్చయించేసుకుని - అప్పుడే విసిగి పెళ్లిసన్నాహాలు చేస్తూన్న భర్త - పెళ్లి - తను రావడం ఒక పదిరోజులాలస్యమైతే, తనకి తెలియకుండానే, తన ప్రసక్తి లేకుండానే జరిగిపోవలసివున్న పెళ్లి - తనుమాత్రం పాకులాడుతోంది - నా యిల్లనీ - నా భర్తనీ, నా సంసారమనీ - కలలన్నీ పొగమంచులా కరిగిపోతున్నాయి.

కిటికీ విలాసంగా రెక్కలాడిస్తోంది - వూచలమధ్య ఇరికించుకున్న అనంతమైన ఆకాశాన్ని చూచుకుని మురుస్తోంది గావును. అవతలవీధులు - ఫ్యాక్టరీగొట్టాలు - మలకలైపోతున్న రైలు పట్టాలు - చుట్టూ విశాల ప్రపంచం - అన్నిటినీ ఆవరించి సముద్రపు హోరు...

భళ్లున తెల్లవారింది.

లక్ష్మి తన సామాను సర్దుకుంటోంది. చలపతిరావు వచ్చాడు. అడుగుదామా అనుకుంటు న్నాడు.

"మెడ్రాసు సేవాసదనంలో జేరాలని వుంది నాకు - వెళ్లిపోతున్నాను."

గుండెకాయకి టార్పెడో తగిలినట్టు నిర్ఘాంతపోయాడు చలపతిరావు.

"లక్ష్మీ, జరిగిన దానికి విచారిస్తున్నాను."

"విచారించకండి. కొత్తపెళ్లికొడుకులు"

బాకుతో పొడిచినట్టయింది.

మేడమీదికి తీసికెళ్లి జరిగిందంతా చెప్పాడు - పెళ్లి మానుకున్నట్టు ఉత్తరం రాసిన సంగతికూడా...

"రోగమూ, రొష్టూలేకుండా రాయిలావుందికదా; ఇక ఫరవాలేదని ధైర్యం చిక్కింది గావును. ఔనా?"

తలవొంచాడు.

"లక్ష్మీ ఈసారికి క్షమించు." గడ్డం పట్టుకుని బ్రతిమాలాడు - లాలించాడు...

లక్ష్మి వెళ్లిపోవడానికే నిశ్చయించుకుంది.

"అయ్యయ్యో, ఎందుకు చెప్పలేదు నాకు?"

నీ రక్తంతో నాకు ప్రాణంపోసిన సంగతి - నాకు తెలిసివుంటే, ఇంత కృతఘ్నుణ్ణి అయివుండేవాణ్ణి కానేమో." తల బద్దలుకొట్టుకుంటున్నాడు - కానీ, ఏమిలాభం?

లక్ష్మి తనపనిలో తనుంది.

"లక్ష్మీ - నాలక్ష్మికాదూ - నన్ను వదలక - నేను భరించలేను - నీరుణం తీర్చుకోలేను - రా - ఇక ఎప్పుడైనా - వినవూ?"

"కైజారుతో పొడిచెయ్యరాదూ? ఎందుకామాటలు? నాకు ప్రాణం వున్నదీ లేనిదీ కూడా అక్కరలేని మీకు - నాకళ్లయెదుట, నాబ్రతుకులో చిచ్చుముట్టిస్తూ - తెగించి, ఒక్కమాట అనేద్దా మనుకుంటున్నాను."

"అను - తప్పునాదైనప్పుడు..."

"మీకు మన్మథజ్వరం వొచ్చినప్పుడు విసుగుపుట్టి నా ఇష్టమొచ్చిన వాడితో లేచిపోతే?" ఆడపులిలా నిప్పులు కక్కుతోంది.

ఆమె తనమీద కసితీర్చుకుంటున్నందుకు లోపల సంతోషపడ్డాడు.

"నామాట విను, లక్ష్మీ, నా తప్పులెన్ని మన్నించలేదు నువ్వు?" పెనుగులాడుతున్నాడు.

"వొదలండి - నన్ను బలవంతపెట్టకండి - వెళ్లకతప్పదు." విడిపించుకుంటోంది.

"వెళ్లి?"

"నాపొట్ట నేను పోసుకుంటాను - చాతగాకపోతే, అంట్లు తోముకుని బతుకుతాను."

"నీ కింకా తెలియదు లక్ష్మీ - నీ వయస్సు - ప్రపంచంలో ఎంత కపటం వుందో - ఎంత నీచంగా వుంటుందో?"

"అదే నేనిప్పుడు తెలుసుకుంట. దిక్కులేక, గతిలేక, అజ్ఞానంలో మిమ్మల్ని పట్టుకుని వేళ్లాడాను - ఇన్నాళ్లూ మీ కౌగిట్లో మీరు నా కెంత విలువకట్టిందీ ఇప్పుడు తెలిసింది నాకు."

కన్నీళ్లు తుడుచుకోకుండానే సూటుకేసు పుచ్చుకుని మేడమెట్లు దిగుతోంది.

మడిబట్ట ఆరేసుకుంటూ ఆడబిడ్డ అందుకుంది.

"ఎక్కడికి వెడుతుందో వెళ్లనియ్యిరా - కూడా బడతావేమిటి?"

"మీ అక్కయ్యని నోరు ముయ్యమనండి - ఇష్టమొచ్చినట్టు పేలిందంటే దవడ పగులు తుంది."

"ఔరా?" ముక్కుమీద వేలేసుకుని నిలబడిపోయిందావిడ.

ఇద్దరూ జట్కా ఎక్కారు. బండి కదిలింది.

"పెళ్లివారు రారని బెంగగావుందిగావును పాపం - రేపు ముహూర్తమాయెను"

"ఏడిపించకు లక్ష్మీ."

"నిన్ననే ఉత్తరం వచ్చింది - నేను వెళ్లే బండిలోనే వస్తారట - ఆదిరెడ్డి దగ్గర్నించి తీసుకున్నా." ఉత్తరమిచ్చింది.

"నేను రావద్దని స్పష్టంగా-"

"అది పోస్టులో పడలేదులెండి." చించిన ముక్కలతనిచేతిలో పెట్టింది.

చలపతిరావుకిప్పుదర్థమైంది.

"ఒక్కమాట వింటావా లక్ష్మీ?"

"చెప్పండి"

"ఎందుకు చెబుతున్నానో విను. పుట్టింటికి వెళ్లు. తరవాత-నీ ఇష్టమున్నప్పుడే"

"నాకు తెలుసులెండి మీ యెత్తు"

"అంటే?"

"పుట్టింటికి వెడితే ఎప్పటికైనా నేను మీ దాన్నేగా."

"ఎలా?"

"మానాన్న నాలుగునీతులు బోధిస్తాడు - పతివ్రతాధర్మాలు విడమర్చి చెప్పి, వొద్దన్నా మీ చేతుల్లో పెడతాడు మళ్లీ - కాదంటే నలుగురి చాతా చెప్పిస్తాడు; అక్కడికీ వినకపోతే పక్క చూపులు మరిగిందనుకుంటాడు. దాంతో నాలుగుతన్ని మరీ పంపిస్తాడు మీ దగ్గరికి-అంతేగా."

ఇద్దరూ చాలాసేపు మౌనంగా వూరుకున్నారు. రైలు పాట్ల్‌ఫారం మీద సిద్ధంగా వుంది.

టిక్కెట్టుకొని రైలెక్కింది.

చలపతిరావు కిటికీకి దగ్గరగా నిలుచున్నాడు-పెళ్లివారు దిగుతున్న సంగతి గమనించ లేదతను.

"ప్రేమ అనీ, సంసారమనీ, మమకారమనీ తీరని ఆశలు పెట్టుకుని లీలగా, ఏదో నాలుగు ఘడియలు మీ కౌగిట్లో వాలిన అడివిపిట్టని. మళ్లీ నా ప్రపంచంలోకి నేను ఎగిరి పోతున్నాను. నన్ను మరిచిపొండి."

అతని కోసమని అల్లిన రుమాలు చేతిలోవుంచి, కంటతడి పెట్టింది.

అతనికీ కన్నీళ్లాగలేదు.